'రచన' మాసపత్రిక - జూలై, 1992

కథా ప్రహేళిక -7

కథా నిలయం
శ్రీకాకుళం

# మయూరి

ప్రెషర్ కుక్కర్‌లా ఉంది నగరం.

దాని మీద మూతలా ఉంది ఆకాశం.

వెయిట్ తీసేయగా కనిపిస్తున్న రంధ్రంలా ఉన్నాడు చంద్రుడు.

విశాలమైన నగరంలోని యిరుకుని పగలంతా ప్రదర్శించిన వీధులు కొద్దిగా అలసట తీర్చుకుంటున్నాయి. ఆ 'యిరుకు' లేనే లేదని రుజువు చేయటానికి అక్కడక్కడ పెట్టిన అడ్వర్టైజ్‌మెంట్ బొమ్మల్లా కొన్ని భవనాలు అలంకరించుకుని ఉన్నాయి. ఆ బొమ్మల హృదయ రాహిత్యాన్ని స్పష్టపరచటానికా అన్నట్లు అనేక భవనాలు తక్కువ మంది మనుష్యులతో మనిషి అలికిడే లేదన్నంత శూన్యంగా ఉన్నాయి. నగరంలో 'యిరుకునంతా ఆబగా స్వీకరించి, నెత్తికెత్తుకొని, మోత బరువుతో కృంగిపోయినట్లున్నాయి అనేక గృహాలు.

నగరం నలుదిక్కులకూ విస్తరించి ఉంది.

వందా, నూట ఏభై ఏళ్ళ క్రితం నగరానికి ఎల్లలుగా నిర్మించిన స్తూపాలు నగరం కేంద్రమయిపోయాయి. చుట్టూ వున్న అడవులు కరిగిపోయాయి. చెరువులు కప్పడిపోయాయి. పేటలు పుట్టుకొచ్చాయి. నదిలో కలిసే ఉపనదుల్లా చుట్టుపక్కల ఒకప్పటి గ్రామాలన్నీ నగరంలో కలిసిపోయాయి. ఒకప్పుడు నగరం అవతల కట్టిన సైనిక నివాసాలూ, శిక్షణా కార్యాలయాలూ నగరంలో భాగమయిపోయాయి.

నగరానికి ఆకారమిస్తున్నట్లు యిళ్ళూ, పేటలూ!


నగరానికి నాడీ వ్యవస్థలా రోడ్లు!

నగరానికి ప్రాణంలా మానవ సముదాయం!

బిన్నీ మిల్లు ప్రాంతానికి ఒకప్పుడు ఎవరూ వచ్చేవారు కారు. వర్షాలతో దానిని ఆనుకుని వున్న గ్రామం నీటిలో తేలుతూండేది. గ్రామ పంచాయతీ వారి రోడ్లు, కాలువలు ఏకమయిపోయేవి. కార్పొరేషన్‌లో కలిసాక అండర్‌గ్రౌండ్ డ్రైనేజి వచ్చింది. పక్కా రోడ్లు వచ్చాయి. గ్రామ భూములన్నీ యిళ్ళ స్థలాలయాయి. రేట్లు పెరిగాయి. యిళ్ళలో అద్దెకు దిగటానికి మనుషులు వచ్చారు. అద్దెలు పెరిగాయి. మూడు నుంచి పది, పది నుంచి యిరవై నెలల అడ్వాన్సులు యిళ్ళకు యిస్తున్నారు జనం. రకరకాల చిల్లర మల్లర వ్యాపారాలు చేసే రాజస్తానీలు ఎంతో ముందు చూపుతో లీజుకి యిళ్ళు తీసుకుని స్వంత యిళ్ళలా వాడుకుంటున్నారు. గల్ఫ్ నుంచి తెచ్చిన డబ్బుని యిళ్ళ స్థలాల మీద పెట్టి, ఒకప్పుడు ఎంత అద్దెనైనా యివ్వటానికి సిద్ధపడిన మళయాళీలు యిప్పుడు యిళ్ళు కట్టి ఎంత అద్దయినా, అడ్వాన్సయినా అడగటానికి సంకోచపడడం లేదు. అక్కడ యిళ్ళు కట్టి నేర్చిన అనుభవంతో, దాచిన సొమ్ముతో మేస్త్రీలు చిన్ని చిన్ని జాగాలు అమర్చుకుని వాటిల్లో అగ్గి పెట్టెల్లాంటి యిళ్ళు కట్టేసి అద్దెల కిస్తున్నారు.

అలాంటి ఒకప్పటి పల్లెకూ, యిప్పటి నగరంలో మధ్యతరగతి వాళ్ళకు అందుబాటులో ఉండే పేటకూ ఆనుకని ఉన్న విశాలమైన ప్రభుత్వ స్థలంలో యిప్పుడిప్పుడే ఓ వసతి గృహాల సముదాయం పుట్టుకొస్తోంది.

సర్కిల్ నుంచి ఆ గృహ సముదాయం కడుతున్న స్థలంలోంచే పాదచారులూ, సైకిళ్ళ



వాళ్ళు ఆ పేటకు వెళుతుంటారు. ఆ రోజు సైకిల్ మీద వస్తున్న రావుగారికి నారాయణన్ కుట్టి సినిమా నుంచి వస్తూ తారసిల్లాడు. వారిద్దరివీ పక్క పక్క యిళ్ళు.



యిద్దరూ అక్కడ పక్కనే వున్న యిసక కుప్ప మీద చతికిలపడ్డారు.

రావుగారూ, కుట్టీ రెండేళ్ళ తేడాలో సర్వీస్ నుంచి రిటైరయ్యాయారు. సర్వీస్ చివరి సంవత్సరాలలో సంపాదించిన యిళ్ల స్థలాలలో సగం అమ్మి, సర్వీసయేసరికి చేతిలో పడిన తృణమూ పణమూ, పెళ్లాం మెడలో చిన్నమూ చిదరా చేర్చి యిల్లు కట్టాడు రావుగారు. మూడు వాటాలనూ ఒకేలా ఆ నగరం పద్ధతుల ప్రకారం కట్టాడు. ఒక గోడ లేపి దాని మీంచి ఆస్బెస్టాస్ రేకులతో కిందకి దించి వెనుక తట్టున కిటికీలుగాని, గుమ్మాలుగాని లేకుండా అక్కడ చాలా యిళ్ళుంటాయి. అవి కడుతున్నప్పుడే యిద్దరు మిఠాయి వర్తకులు మార్కెట్ రేటు కన్న పదో పరకో వేసి అందులో రెండు వాటాలను లీజుకి తీసుకున్నారు. ఆ డబ్బు కూడా యిల్లు కట్టడంలో పడిపోయింది. యింటికి ముందు ఓ గజం, ఒక పక్కన రెండు గజాల ఖాళీస్థలం మాత్రం ఆ యింటికి ఉంది.

నలభై అయిదేళ్ళకు సర్వీసు వదిలాడు రావుగారు. వదిలిన వెంటనే ఆయన అక్కడికి యిరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా చేరాడు. అంత దూరమూ సైకిల్ మీదనే డ్యూటీకి వెళతాడు. వస్తాడు. వచ్చాక మార్కెట్ చేసుకొచ్చి కావల్సినవన్నీ వండించుకు తింటాడు. రోజూ రెండు పెగ్గుల కోటా రమ్ము తాగుతాడు. భోజనమయాక గంటసేపు ఆ పేటలో వీధులను తిరిగి, పరిచయస్తులతో కబుర్లు చెప్పి యింటికి వస్తాడు. ఇంటావిడ తెల్లని చీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని పనులన్నీ పూర్తి చేసుకుని రావుగారి కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

రావుగారిని కొందరు జోకుల రావంటే కొందరు బూతులరావంటారు. ఏమన్నా ఒప్పుకుంటాడు గానీ, 'గారు' చేర్చకపోతే మాత్రం ఒప్పుకోడు. 'సాలే! నీ అక్క మొగుడినా నేను! మాట్లాట్టం రాదూ - మా తెలుగోళ్ళ మన్ననా, మర్యాదా మీకు రావు' అంటూ ప్రాంతాలనూ, భాషలనూ ఎత్తి తిడతాడు. అతను తిడుతుంటే ఎవరికీ సాధారణంగా కోపం రాదు. సర్వీస్‌లో బాక్సర్‌గా తను గడించిన పేరూ, బహుమానాలూ, పై ఆఫీసర్ల మెచ్చుకోళ్ళూ కథలు కథలుగా చెపుతూ - ఒక్కోమారు గాలిలోకి పంచ్ చేస్తూ అతను చూపే విన్యాసాలకు శ్రోతలూ, ప్రేక్షకులూ చాలామందున్నారు.

కొన్నాళ్ల క్రితం కుక్క గొడుగుల్లా పుట్టుకొచ్చిన వీడియో పార్లర్లకి అతని యీడు వాళ్ళు బలవంతంగా రావుగారినీ ఓసారి తీసుకెళ్ళారు.

"ఛత్! చేతగానాళ్ళలారా! బొమ్మల్ని చూస్తే ఏముందిరా - మా చెల్లెళ్ళని యిళ్ళలో పస్తు పడుకోబెట్టి -" అని తిట్టి పోసాడు.

రావుగారి కున్న వ్యాపకాలలో పరోపకారమొకటి!

అతనికి ఆ పేటలో వీధి వీధినా స్నేహితులున్నారు. ఎవరింట్లో కార్యమున్నా, కష్టమున్నా

రావుగారు అక్కడ హాజరు. కొత్తగా ఎవరైనా తెలుగోడు అక్కడ అద్దెకు దిగితే తనంత తనే పలకరిస్తాడు. ఇంట్లో ఎవరయినా ముసిలాళ్ళు గనక ఉంటే ఆ గృహస్థుని పక్కకి తీసుకెళ్ళి అంటాడు –

"చూడబ్బాయ్! సర్వీసులో రెండు యుద్ధాలు చూసాను. వందలూ వేలూ శవాలు చూసాను. తప్పదు! మనిషన్నాక ఆ రోజు ఎప్పుడో అప్పుడు వస్తుంది. వాళ్ళు మీ అమ్మో నాన్నో అయినా తప్పదు. మన రెడీలో మనం ఉండాలి. పెళ్ళన్నావూ – టైముంటుంది. డబ్బు ఏర్పాటు చేసుకోవచ్చు. బేరాలాడుకోవచ్చు. మనుషులు దొరుకుతారు! చావు అలా కాదు – చచ్చే చావవుతుంది. ఏ నా కొడుకూ వచ్చి నిలబడడు! నీ యింటికి వచ్చి నీ కూతుళ్ళకు ఫోజులు కొట్టే గాడిద కొడుకులు కూడా పరుగో పరుగు! ఈ రోజుల్లో కుర్ర గాడిదలు మరీ దొంగ గాడిదలు! పెద్దాళ్ళే నయం! మనిషీ, సాయమూ అనుకుంటాం! ఊరుగాని ఊరని బెంగ పెట్టుకోకు! కాకితో కబురంపు! వచ్చి నిలబడతాను!" అంటాడు.

ఇలా మాట్లాడితే కొత్తవాళ్ళకెలా ఉంటుంది? ఒక్కొక్కడు ముఖం మీదే తలుపేసి పొమ్మంటాడు. రావుగారికి కోపం రాదు – "పిల్లకాకికేం దెలుసు ఉండేలు దెబ్బ? రేప్పొద్దుట వీడే వచ్చి 'బాబయ్యగారూ! మా అమ్మ పోయిం'దని ఏడవకపోతే నా చెవి గదపాయిస్తాను" అంటాడు.

రావుగారిని కొత్తలో అపార్థం చేసుకున్నా, త్వరలోనే సులువుగా అర్థమవుతాడు. ఆయన పైవాడి నుంచి పైసా అయినా ఆశించడు. టీ ఆఫర్ చేసినా పుచ్చుకోడు. తనంత తను సాయానికి వస్తాడు. అయినా అతన్ని భరించటం కష్టం. ముఖ్యంగా ఆయన భాష సాధారణ, సంస్కారాలకు అతీతమయినది. ఆయన ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుని సలహాలిస్తాడు. స్కూళ్ళు, కాలేజీలు, చిన్న చిన్న ఉద్యోగాలు – అన్నింటి గూర్చీ సమాచారమిస్తాడు. దాంతో బాటు –

"ఏమయ్యా! నీ తండ్రికి కాలికి జోడయినా కొనలేదూ! నిన్ననా పెద్దాయన ఎండబడి గుడి కెళ్తూంటే రోడ్డు పక్క చతికిలబడిపోయాడు! ఏం నీ పెళ్ళాం పౌడర్లకీ, లిపుస్టిక్కులకే గాని నీ బాబు కాలిజోడుకి జేబులు నిండుకున్నాయా?" అని వాయించేస్తాడు.

"అసలీ ముసలివాళ్ళననాలి! మొదట్లోనే కోయించేసుకుని పెళ్ళాంతో పడుకుంటే మీరు పుట్టేవాళ్ళా? యీ సిటీలో షికార్లు కొట్టేవాళ్ళా?" అంటాడు.

రావుగారికి ముసిలాడూ – పడుచువాడూ అన్న భేదానికి ఖచ్చితమైన లెక్కలున్నాయి. ఇరవై అయిదేళ్ళ సర్వీసులో నారాయణన్ కుట్టి, రావుగారూ పద్దెనిమిదేళ్ళు అనేక ప్రాంతాలలో కలిసి వున్నారు.

"నువ్వింకా కుర్రాడివట్రా రావుగారూ?" అంటాడు కుట్టి.

"ఎవడి పెళ్ళాం దగ్గర వాడు ఏడిసినన్నాళ్ళూ మనిషి పడుచాడేరా కుట్టీ! ఆడు పక్క చూపులు చూడడం మొదలెడితే మధ్య వయసొచ్చేసిందన్నమాట! ఆడికి కక్కుర్తీ, యావా చచ్చిపోయాయనుకో అప్పుడూ ఆడు నీకులా ముసిలాడయిపోతాడు" - రావుగారు సంస్కార యుతమైన ధోరణిలో ఉన్నప్పుడు అంత మృదువుగా జవాబిస్తాడు.

కుట్టి రిటైరయాక ఓ బేకరీ పెట్టాడు. సర్వీసులో అతను వంటవాడు. ఓ చుట్టం కుర్రాడిని పెట్టి ప్రస్తుతం ఆ బేకరీని నడుపుతున్నాడు. రొట్టెలు చేసే సమయంలో ఓ మారూ, దుకాణం మూసేస్తున్నపుడొక మారూ వెళ్ళి చూసుకుంటుంటాడు కుట్టి.

"నువ్వూ ఏదయినా షాపు పెట్టుకోగూడదురా రావూగారూ?" అనేవాడు.

"అది మాకు నప్పదురా! మాది తిండేత వ్యవహారం! నా కొడుకుని కూర్చోబెట్టినా సరే - అంతా ఒక్కలాగే మదుపుతో సహా మొత్తం మింగేస్తాం?" అంటాడు రావుగారు.

"రోజుకి నలభై కిలోమీటర్లు సైకిలు తొక్కితే నువ్వెందుకు పనికొస్తావురా? ఎన్నాళ్ళు బతుకుతావురా!" అంటాడు కుట్టి.

"ఎందుకి పనికొస్తానా నీ చెల్లెల్ని అడుగు! పిలవనా?"

"నీకు సిగ్గూ ఎగ్గూ లేవురా!" అంటూ పంచ్ చేయబోతాడు కుట్టి. ఇద్దరూ బాక్సింగ్‌కి సిద్ధమయిపోతారు.

"మీ సినిమాలకి జనం యిలా ఎగబడిపోతారు. అవి జూసి మీరేదో మహా పోటుగాళ్ళంటారంతా! ఎవడిని జూసినా ఎప్పుడూ ముసిలాళ్ళలా వేళ్లాడి పోతారేంట్రా?" అడుగుతాడు రావుగారు.

"మా సినిమాలు మీలాంటాళ్ళకి! మేం వేరు!"

"మీరు డబ్బు సంపాదించటానికి పుట్టార్రా!"

"కష్టపడతాం! వళ్ళు వంచుతాం! పావలా పెట్టుబడి పెట్టి పావలా లాగటానికి చూడం! పైస చాలనుకుంటాం! రొటేషనుంటుంది! మిగులు ఉంటుంది" అంటాడు కుట్టి.

కుట్టి చెప్పినట్లు కొడుకి చేత ఏదయినా దుకాణం పెట్టిద్దామా అని రావుగారూ మనసులో అనుకున్నాడు. పార్థూ అతనికి ఎలాంటి సహకారమూ యివ్వలేదు. రావుగారి జీవిత పరిస్థితే కొడుకు మీద ప్రయోగం చేసే సాహసం యివ్వలేదు.

పార్థు మొదటి సంతానం. రెండు, మూడు గాయత్రి, అనసూయా! నాలుగో వాడు సాయి. చురుకయిన కుర్రాడు. నలుగురిలోనూ పార్థు రావుగారికి ఏ విధంగానూ కలిసిరాలేదు.

పార్థుకి చదువు అబ్బలేదు.

"నేనెక్కడో ఆంధ్రదేశంలో తూర్పు గోదావరి జిల్లాలో సెకండరీ స్కూలు కూడా లేని

పల్లెటూళ్ళో పుట్టాను. చదువుకోలేక పోయాను. అయితేనేం? తెగించాను. సైన్యంలో చేరాను. దేశమంతా చూసాను. రెండు యుద్ధాల్లో ఫ్రంటులో వున్నాను. ఇప్పటికీ యిలాంటి సిటీలో యిల్లు కట్టాను. మీరంతా చదువుకోవాలనే గదా యిక్కడ కాపురం పెట్టాను. బడికి వెళ్ళవు! వెళ్తే పాఠం వినవు! నువ్వు పిల్లల్ని పాడుచేస్తావని మాస్టర్ల కంప్లయింట్లు! ఇన్ని సదుపాయాలుంటే - నీకేం రోగమొచ్చిందిరా - చదువుకోడానికి" - రావుగారు అతన్ని కొట్టడు. తిడతాడు... ఆ తిట్లకి హద్దూ ఆపూ ఉండదు. పార్థు యస్సెల్సీ దాటలేదు.

పార్థు జవాబివ్వడు! తల ఎత్తడు!

కుట్టీ సలహా మీద మరో ఎక్స్ సర్వీస్ స్నేహితుడు హుస్సేన్ స్కూటర్ సర్వీసింగ్ షాపులో చేర్చాడు. అక్కడ పని వొచ్చిన వాళ్ళకి నేర్చుకొనే వాళ్ళు మొదట్లో పనిముట్లు అందిస్తారు. క్రమంగా స్పార్క్ ప్లగ్ క్లీన్ చెయ్యడం, చక్రాలు విప్పడం లాంటి పనులు నేర్పుతారు. పార్థు లాంటి కుర్రాళ్ళని హుస్సేన్ చిటికెలో పట్టేస్తాడు. పరాయి వాళ్ళను పంపేస్తాడు. కావలసిన వాళ్ళనయితే వంచుతాడు. గీర మాటలు ఆడితే నాలుగు తగిలించుతాడు. పార్థు పని నేర్చుకోలేదు. పదిసార్లడిగితేగాని పనిముట్లివ్వలేదు. నాలుగు సార్లు గట్టిగా బెదిరించాడు. రెండుసార్లు కొట్టాడు. పార్థు దెబ్బకి జడిసాడు గాని వళ్ళు వంచలేదు. సర్వీసింగ్‌కి వచ్చిన స్కూటర్లో పెట్రోలు తీసి అమ్మేస్తూంటే హుస్సేన్ పట్టుకొన్నాడు.

"లాభం లేదు రావుగారూ! నీ కొడుక్కి పని దొంగతనమే గాదు - దొంగతనమూ ఉంది" అని ఆ రాత్రి రావుగారితో కూర్చుని రమ్ము తాగుతూ చెప్పాడు హుస్సేన్.

రావుగారికి ఆశ్చర్యం కలిగింది. పార్థు ఏదయినా చెయ్యొచ్చు ఏమైనా అనవచ్చు గానీ దొంగతనం చేస్తాడా - అనుకున్నాడు. హుస్సేన్ లేని మాట అనడు. పార్థుని పిలిచి అడిగాడు.

"నాకు అంకుల్ దగ్గర పని యిష్టం లేదు. పంపేస్తాడని దొంగతనం చేసాను" అన్నాడు.

హుస్సేన్ లేచి పార్థుని ఒక్క దెబ్బ కొట్టాడు. తూలి పడిపోయాడు పార్థు.

'నువ్వీ పని చేసిన రోజున వీడిలా ఉండడు రావుగారూ! పదేసి మందు పిల్లలు మా వాళ్ళకు! ఒక్కడయినా ఎదిరిస్తాడా? ఆరేడేళ్ళు వచ్చిన దగ్గర నుంచి ఎవడి పొట్టకు వాడు చూసుకోవాల్సిందే! ఒక్కడయినా దారి తప్పుతాడా? కూచోబెట్టి బాగా ఖుషామత్ చెయ్యి.... పోతాడు నీ కొడుకు" అన్నాడు హుస్సేన్.

ఆ తర్వాత అయిదారేళ్ళుగా పార్థుని రావుగారు చాలా కంపెనీలలో పెట్టాడు. ఎక్కడా అతను స్థిరంగా ఉండడం లేదు. కొందరు అతన్ని తీసేస్తే కొన్ని అతను మానేసాడు. చేతిలో డబ్బులుంటే సినిమాలు చూసేవాడు. నగరంలో పక్కా సినిమా హాళ్ళు ఎన్నున్నాయో

అంతకు రెట్టింపు టూరింగ్ టాకీసులున్నాయి. రూపాయి రెండ్రూపాయలతో నేలలో కూచుని సినిమాలు చూసేయవచ్చు. వాటిలో పదకొండు గంటలకు మళయాళం, యింగ్లీషు సినిమాలు వేస్తారు. ఏదో కొన్ని హాళ్ళు తప్పించి, సాధారణంగా యీ సినిమాల మధ్య మధ్య బ్లూ పిలిమ్స్ లోంచి చిన్ని చిన్ని ముక్కలు జోడించి అన్ని హాళ్ల వాళ్ళూ వేస్తారు. అపుడపుడు పోలీసులు పట్టుకుంటారు. అరెస్టులు! ఫైనులు! సినిమాలు నిరంతరాయంగా నడుస్తూనే ఉంటాయి. 'బాబోయ్! నా సినిమాలో యివి లే"వనిఎవరో ఓ నిర్మాత వచ్చి హఠాత్తుగా దాడి చేయించి పేపర్లకి ఎక్కుతుంటాడు! సినిమా నడుస్తూనే ఉంటుంది.

పార్థు చేతిలో డబ్బులుంటే ఆ సినిమాలు చూస్తాడు. లేకపోతే అమ్మా నాన్నా పడుకునే మంచం మీద దుప్పటి ముసుగేసుకుని బోర్లా పడుకుంటాడు. ఆ వాటాలో కాలు పెట్టగానే కనిపించే నాలుగు గోడల మధ్య భాగాన్ని 'హాలు' అంటారు. అదే దంపతుల పడక గది! అతిథులు కూర్చునే గది! పిల్లలు చదువుకునే గది! టీవీ చూసే గది! దాని వెనుకెనిమిది అడుగుల సైజులో ఒక గదీ! అది దాటితే బాత్రూం, వంటిల్లూ! ఆ చిన్న గదిలో పిల్లలంతా చాపల మీద, పాత గుడ్డలు కుక్కి కుట్టిన చవకబారు పరుపుల మీద పడుకుంటారు. వాళ్ళు పడుకుంటే మసలటానికుండదు. పగలు ఎవరు పడుకోవాలన్నా, నలుగురు అతిథులు వస్తే కూర్చోవాలన్నా ఆ ఆరూ నాలుగూ మంచమే శరణ్యం.

కొడుకుని ఏం చెయ్యాలని ఆలోచిస్తాడు - ప్రయత్నిస్తాడు గాని - రావుగారు తల పట్టుకు కూర్చోడు.

"నువ్వలా ఎలా ఉండగలవురా రావుగారూ?" అని విశ్వనాథన్ చెట్టియార్ అడిగేవాడు. అతను ఆ పల్లెలో మొదటి నుంచీ ఉన్న మనిషి. చాలామంది ఎక్స్‌సర్వీస్ వాళ్ళు అతని ద్వారానే అక్కడ స్థలాలు కొన్నారు. ఆ పల్లెలో మగ్గాల మీద బతికే కుటుంబాలు ఎక్కువ. పట్టు తెచ్చి పెట్టటానికి, వాళ్ళకి కావల్సిన రంగులు తేవటానికి విశ్వనాథన్ ఆదిలో తిరిగేవాడు. బాగానే వెనకేసాడు. యిల్లు కట్టాడు. భార్యకి మెడలో బంగారం, బోల్డన్ని పట్టు చీరలూ కొన్నాడు. ఆవిడ మాత్రం అతన్ని రాచి రంపాన పెట్టింది. చివరకి రెండేళ్ళ క్రితం అన్నీ వదిలేసి సన్యాసుల్లో కలిసిపోయాడు. అతనుండగా ఆ ప్రశ్న అడిగితే -

"అన్నీ పట్టించుకొని ఏడిసే నీలాంటి వాళ్ళను చూసి! ఒరే చెట్టియారూ! నా పెళ్ళాంలా సుఖపెట్టేది నీకూ ఉంటే నువ్వూ నాలాగే ఉంటావు! దానికీ నాకూ రోగాల్లేవు! ఆశల్లేవు! పగలల్లా అది యింట్లోనూ, నేనూ డ్యూటీలోనూ వళ్ళు వంచుతాం! రాత్రి వేళ..." అంటూ బూతు మాటాడేవాడు.

ఏణ్ణర్థం క్రితం ఓ రోజు భార్య రావుగారితో అంది -

"పెద్దాడికి పెళ్ళి చేసేద్దాం"

"నేను దాన్ని కూడా పోషించాలి – నువ్వు చాకిరీ చెయ్యాలి"

"తప్పదు! ఎదిగిన పిల్లలున్నారు! వాడలా మంచం మీద బోర్లా పడుకుంటే... బాగోదు!"

"పని లేకపోతే ఏం చేస్తాడు – పడుకోక?"

"మీ కర్థమవదు"

రావుగారికి అర్థమయింది. ఏభై అయిదేళ్ళున్న తనకే చల్లారలేదు. పైసా సంపాదన లేకపోయినా పాతికేళ్ళు పైబడిన కొడుకు వచ్చే వయసునెలా ఆపగలడు?

భార్యాభర్తలిద్దరిదీ ఒకటే తత్వం. ఏది ఎలా జరగాల్సుంటే అలా జరుగుతుందనే వాళ్ళ నమ్మకం. పెళ్ళి మాట ఎత్తినప్పుడల్లా వాడిని స్థిరపడనీ అనేవాడు. పెళ్ళి చేస్తే వాడికో గది కావాలి. మిఠాయి వర్తకుల చేత ఒక వాటా అయినా ఖాళీ చేయించాలంటే పదిహేను వేలయినా కావాలి! మళ్ళీ అద్దెకి యిచ్చేట్లయితే ఎక్కడో పుట్టించవచ్చు! అడ్వాన్సో, లీజో దొరుకుతుంది. లేకపోతే ఎలా తీరుస్తాడు? వడ్డీలకే అయిపోతుంది తన జీతం! అనుకునేవాడు.

పెళ్ళయితే స్థిరమవుతాడని – ఆవిడ ఆశ

లోపల్లోపల నలిగి, నలిగి భర్తతో ఖండితంగా చెప్పేసింది.

కుట్టీతో అన్నాడు రావుగారు... 'మీ వాళ్ళు ముప్పై, ముప్పైయ్యేడేళ్ళు వచ్చినా పెళ్ళి ఊసు ఎత్తరు. మీ వాళ్ళకి...?" అని అడిగేవాడు.

కుట్టి గుద్దుతూంటే రావుగారు తప్పించుకునేవాడు.

"చేసెయ్యి! నీ కోడలికి గూడా నువ్వే తిండి పెట్టాలి"

"తప్పదురా కుట్టీ! రెండేళ్ళలో గాయత్రికీ, అనసూయకీ చదువులయిపోతాయి. నాకూ సర్వీసయిపోతుంది. – ఆ తర్వాత పార్థూకి పెళ్ళి చేసేసి యింటినీ, సాయిగాడినీ వాడికి అప్పజెప్పేస్తాను. మా ఊళ్ళో నా వాటాను మా తమ్ముడు యిస్తాడు! అక్కడ మా వేపు ఆడ పిల్లలకి పెళ్ళిళ్ళు సులువు! ఆ తర్వాత యింకేం గావాలి? నేనూ, మీ చెల్లీ పట్టెడన్నం, క్వార్టరు రమ్మూ – చాలు జీవితానికి! ఈ మూడేళ్ళు గడిస్తే చాలు!" అనేవాడు.

కుట్టీ రావుగారి ప్లానుని ఒప్పుకోలేదు. ఎంత బతిమలాడినా పార్థు సర్వీస్‌లో చేరననేసాడు. అప్పటికింకా గల్ఫ్ యుద్ధం రాలేదు.

"పార్థూని గల్ఫ్ పంపెయ్యి – నాలుగు రాళ్ళు కూడబెట్టుకుంటేనే పెళ్ళి చేస్తానని చెప్పు" అనేవాడు కుట్టి.

రావుగారు చెప్పకపోలేదు. పార్థూ వినలేదు. ఇంతలో గల్ఫ్ యుద్ధమూ వచ్చింది.

సరిగ్గా ఆ రోజుల్లోనే పార్థు ఒక ఉత్తరం రాసి పెట్టి హఠాత్తుగా ఒక రోజు యింట్లోంచి వెళ్ళిపోయాడు.

ఆ ఉత్తరంలో తల్లినీ, తండ్రినీ అనరాని మాటలన్నాడు.

ఎదిగిన పిల్లలుండగా మీరిద్దరూ ఓ గదిలో జేరడమేంటన్నాడు. ఎన్నేళ్ళొచ్చినా ఆగని మీ సరసాలేంటన్నాడు. ఊహ వచ్చిన దగ్గర్నుంచీ నాకు మరో ధ్యాస లేకుండా చేశారన్నాడు. ఎన్నాళ్ళు ఆగుతాను - చెయ్యరాని పని చేసాను - పావలాకీ పరకకీ నాకు దొరికేవేమిటి? రోగాలు - అన్నాడు. నా రోగం ఎయిడ్స్! మందు లేదు! దీన్ని ఎవరూ ట్రీట్ చెయ్యరు! అన్నాడు.

ఇన్నాళ్ళూ నేను చెల్లెళ్ళకూ, మీకూ, తమ్ముడికీ పావలా ప్రయోజనం లేకుండా బ్రతికాను. ఏమీ యివ్వలేని వాడిని యీ రోగాన్ని మీకు యివ్వటం న్యాయం కాదు. నా గాలి తగిలితే తమకీ అంటుకుంటుందని డాక్టర్లూ, నర్సులు కూడా భయపడే యీ రోగాన్ని మీ మధ్య మసలి మీకూ తగిలించడం అన్యాయం! కనక నేను వెళ్ళిపోతున్నాను-

ఆ ఉత్తరం పట్టుకుని పిచ్చెత్తినట్లు తిరగాడు రావుగారు. ఎక్కడా పార్థు దొరకలేదు. కుట్టీ, అతని స్నేహితులు నీడలా రావుగారిని అంటి పెట్టుకున్నారు.

ఆ రోజుకి ఏడాది తిరిగింది.

ఆ రోజు వాళ్ళిద్దరూ యిసక కుప్ప మీద చతికిలపడ్డారు.

పైన చందమామ!

పక్కనుంచి జాతీయ రహదారి మీదగా పోతున్న లారీల చప్పుళ్ళు! గలగలా మాట్లాడే రావుగారు మాటలు కరువయినట్లు కూర్చున్నాడు.

“ఏంట్రా యిదీ? నువ్వు యుద్ధాలు చూసావు. శవాల కుప్పలను చూసావు! సామూహిక దహనాలు చూసావు! ఎన్నో శవాలు మోసావు! చావంటే నీకు భయం లేదు! జీవితమంటే అంతకన్నా భయం లేదు! ఎందుకురా రావూగారూ నువ్వీ దెబ్బ తట్టుకోలేకపోతున్నావూ?”

రావుగారు నవ్వాడు -

“వాడు ఏ రోడ్డు ప్రమాదంలోనో పోయాడనుకో! సర్వీసులో జేరి ఏ శ్రీలంకలోకో పోయాడనుకో! ఓ ఏడుపు ఏడిచేవాడిని! ఆయువు తీరిపోయిందని - గుండె రాయి చేసుకునేవాడిని! వాడు యిలా అయిపోయాడు. పోతూ పోతూ వాడు వేసిన ప్రశ్నలూ - చేసిన ఆరోపణలూ - నన్ను దొలిచేస్తున్నాయి.

“మనిషి సుఖించడం తప్పా? నేనేమయినా పరాయి ఆడవాళ్ళ కోసం ఏడిసానా? - వాడు నాది తప్పంటాడు. నాది రోగ మంటాడు. నాది పైత్య మంటాడు. ఏం చేస్తాను - నిత్యం ఏడవాల్సిన ఎన్నో ఏడుపులని నా భార్యతో ఆ మంచం మీద పడుకుని నేను మరిచిపోగలిగాను. ఆదమరిచి నిద్రపోయాను. మొయ్యలేని బరువులు! దుర్భరమయిన యిరుకూ - అలివిగాని ప్రపంచం! నన్నేం చెయ్యమంటావురా కుట్టీ! నాకు చేతనయినట్లు

నా పాత్ర నిర్వహించాను.

కానీ - కుట్టీ!

ఎన్ని దుఃఖాలనయినా సహించటానికీ, భరించటానికీ నాకున్న ఏకైక వరాన్ని వాడు తనతో బాటు తీసుకుపోయాడు! ఈ ఉన్న ఒక్క గదినీ, మంచాన్నీ - వాడికి పెళ్ళి చేసి యిచ్చేయగలిగితే - నేనూ, నా భార్య ఆ రెండవ గదిలో నా పిల్లల్ని మధ్యలో పడుకోబెట్టుకుని పడుకోగలిగితే - వాడు బ్రతికే వాడన్న ఊహ నాకూ, మీ చెల్లికీ కలగకుండా ఎలా ఉంటుందిరా?

నేను యయాతినిరా కుట్టీ!

యయాతి తన కొడుకుల యవ్వనాన్ని అడిగాడు! యివ్వని వాళ్ళని శపించాడు! యిచ్చిన వాడి నుంచి పుచ్చుకున్నాడు.

ఆ యయాతి దాన్ని పుచ్చుకుని సుఖపడ్డాడు!

ఈ యయాతి దాన్ని దోచుకుని - సుఖపడగలిగే శక్తిని పోగొట్టుకున్నాడు!"

కుట్టీ రావుగారిని చూస్తూ వింటున్నాడు.

భారతదేశ దారిద్ర్యానికీ, దాని కామానికీ, దాని జనాభాకీ మధ్యనున్న అవినాభావ సంబంధం అతనికి స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది.

అతనికి -

నగరం ప్రెషర్ కుక్కర్‌లా ఉంది.

ఆకాశం దాని మూతలా ఉంది.

ఆనందోద్రేకాల చందమామ దాని మీది వెయిట్ తీసేయగా కనిపిస్తున్న రంధ్రంలా ఉన్నాడు. ✿

---

ఈ శీర్షికలో ఏడవ కథ - 'యయాతి'. రాబోయే రెండు కథలతో ఈ శీర్షిక పూర్తవుతుంది. ఈ తొమ్మిది కథలనూ బేరీజు వేసి గ్రేడింగ్ ఇచ్చేందుకు ప్రఖ్యాత కథకులు శ్రీ కాళీపట్నం రామారావుగారు అంగీకరించారు. వారి గ్రేడింగ్‌తో సరిపోయిన ఎంట్రీకి అక్షరాలా వెయ్యి రూపాయలు బహుమానం! ఆ పాఠకుని ఫోటో పరిచయం ప్రత్యేకం! అట్లా సరిపోయిన ఎంట్రీలు ఒకటి కన్న ఎక్కువ ఉంటే బహుమానం సమానంగా పంచబడుతుంది. సరయిన ఎంట్రీలు రాకపోతే బహుమానాన్ని రద్దు చేసే హక్కు సంపాదకుడికి ఉంటుంది.

పాఠకులారా! త్వరపడండి! మంచి తెలుగు కథ మనుగడకి, మీ ఆలోచనా శక్తికి, విచక్షణా జ్ఞానానికి పదును పెట్టండి!... కలం పట్టండి!!! - సం॥

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

'యయాతి' కథ మీద దాదాపు అందరూ ఏకాభిప్రాయాన్ని తెలియజేశారు. అందరికీ కథలో నచ్చిన అంశాలే కనిపించాయి. చాలామంది పార్ధు నాశనానికి కారణం వృద్ధుని సెక్సు వాంఛేనని అభిప్రాయపడ్డారు. పార్ధుది తప్పని కొద్దిమంది అన్నారు. నగర జీవితంలో యిరుకు కారణమని కొద్దిమంది అన్నారు. నచ్చని అంశాలను పేర్కొన్నవారు చాలా తక్కువ.

నచ్చిన అంశం : 1. కథలోని విషాదానికి కారణం సమాజ మూలాలలో ఉందని స్పష్టంగా చెప్పింది **బమ్మిడి సరోజిని** (కాశీబుగ్గ). 2. రావుది స్వయంకృతాపరాధమన్న తమ భావనని చక్కగా చెప్పింది **టి.వి. శ్రీనివాసరావు** (అండలూరు)

నచ్చని అంశం : 1. కథలో సాఫీతనం కొరవడినదన్న తమ భావాన్ని వివరించినది **జె. అనూరాధ** (హైదరాబాద్).

నచ్చిన అంశం

## ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

ఆహారం, నిద్ర, భయం, కామం లేకుండా ఏ ప్రాణీ లేదు - చివరకు మనిషి కూడా! అందులో ఏ ఒక్కదాన్ని తీర్చుకోలేకపోయినా జీవితం దుర్భరమవుతుంది. ఈ విషయాన్నే 'యయాతి' కథ చక్కగా వివరించింది. భారతదేశ దరిద్రానికీ, దాని కామానికీ, దాని జనాభాకీ మధ్యనున్న అవినాభావ సంబంధం కుట్టికి (రావుగారి మాటలు విన్నాక) స్పష్టాస్పష్టంగా అవుపించినా, ఆలోచిస్తే పాఠకులకి కూడా స్పష్టంగా, సూటిగానే కనిపిస్తుంది.

కథ ఎత్తుగడ ప్రారంభం నుండి ముగింపు దాక ఆసక్తికరంగా వుండి ఆలోచనల్లోకి విసిరేసింది. రావుగారు నలభై ఐదేళ్ళకు సర్వీసు వదిలి, మరో ఫ్యాక్టరీలో డ్రైవరుగా చేరడం అతనిపై ఇంటి భారాన్ని అంచనా వెయ్యొచ్చు. కలుపుగోలు మనిషి. పైగా వృత్తి (డ్రైవర్)కి తగ్గట్టుగానే మాటలో బూతు కనిపించినా మనసు మంచిదే. భార్య మీద ప్రేమ వుంది. పరాయి స్త్రీల కోసం ప్రాకులాడేవారి పైన అసహ్యం కనపరుస్తాడు. అందుకే ప్రకృతి సిద్ధంగా వుండే కోరికను భార్య ద్వారా పొందుతాడు. తద్వారా తన 'ఇరుకు' జీవితంలో బాధల్ని మరిచిపోగలిగాడు.

మరి పార్థు (కొడుకు) ఆరోపణలు చూస్తే ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఎంత కోరిక బలీయమైనదైనా పిల్లలు వయసుకొచ్చాక ఏ తల్లీ దండ్రీ కూడా పిల్లల్ని పట్టించుకోకుండా సెక్సు కోసం ప్రాకులాడరు! యిరుకు గదుల్లో (ఉమ్మడి కుటుంబాలు విడిచి పెట్టినా) పిల్లల చదువులు, నిద్రల మధ్య - (బాధలు తప్పితే ఏం చెప్పుకోగలరు - దుర్భరమైన జీవితం మరి) కోరిక తలెత్తందే, విచ్చలవిడితనంకి దారేది? పిల్లల కోసం, వారి బాగు కోసం, యిరుకుని భరించడం కోసం కలయిక కొరవడిన వారు ఎందరో వున్నారు గాని ఎదుటే కలసిన వాళ్ళు చాలా తక్కువ.

ఇక పార్థు పాత్ర స్థిరత్వం లేనిది. చదివిస్తే చదువూ అబ్బించుకోక, పనిలో పెడితే పనీ చెయ్యక సినిమాలు లేకపోతే (బోర్లా) బొమ్మల్లే పడుకోవడం... పైగా తలిదండ్రుల చర్యలను గమనించడం, కోర్కె తీర్చుకోవడానికి పావలా, పరకకు రోగాలు (ఎయిడ్స్) తెచ్చుకొని తల్లిదండ్రులను నిందించడం ఏమంత సబబు కాదు. రోగాన్ని అందరికీ అంటించకూడదనో, తలెత్తుకోలేకో నిష్క్రమిస్తాడు.

పాపం రావుగారి భార్య కొడుకు పెళ్ళి గురించి పోరినా, సహజంగానే కొడుకు స్థిరపడనీ అన్న రావుగారి మాటలు వాస్తవానికి దగ్గరగా వున్నాయి. అయినప్పటికీ ఆ భారమూ తనే వహించి రెండేళ్ళలో రిటైరు అయ్యాక కొడుకుకి పెళ్ళి చెయ్యాలనుకున్నా

రోగంతో కొడుకు ఇల్లు విడిచిపెట్టడం విషాదం! ఆ కఠినమైన విషాదం వెనుక ఖచ్చితమైన వాస్తవ దారిద్ర్య రేఖ వుంది. ఆర్థిక అస్థిరత వుంది. యిరుకుదనం వుంది.

కొడుకుల యవ్వనాన్ని అడిగి వాళ్ళను శపించినంత మనసులేని యయాతి కాదు రావుగారు. ఈ యయాతి (కొడుకును మరచినందుకనుకున్నా) దోచుకున్నట్టు అన్నా అది భ్రమే! పాతికేళ్ళు వచ్చిన పార్థుయే కాదు, ఎందరో నిరుద్యోగులు వయసు మళ్ళి - చావని కోర్కెలతో చావుకైనా సిద్ధపడ్డం నిత్యసత్యం.

ఈ కథలోని కఠినమైన విషాదమంతా సమాజ మూలాల్లోనే వుంది. పాలనా పరిపక్వత లేని నిద్ర, ఆహారం, కామం, భయం ఏవీ తీరకున్నాయి. భవిష్యత్తు భూతంలా వుంది.

ఏమైనా కథ చెప్పేతీరు - 'నగరం ప్రెషర్ కుక్కర్‌లా వుంది. ఆకాశం దాని మూతలా ఉంది. ఆనందోద్రేకాల చందమామ దాని మీద వెయిట్ తీసేయగా కనిపిస్తున్న రంధ్రంలా వున్నాడు' లాంటి వాఖ్యలతో మరింత కథకు పటుత్వాన్నిచ్చినందుకు రచయిత కభినందనలు.

- బమ్మిడి సరోజిని

**ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ**

తల్లిదండ్రులు ప్రవర్తన పిల్లల మీద ఎటువంటి, ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందో ఈ నెల 'కథాప్రహేళిక' శీర్షికలోని 'యయాతి' కథ చక్కగా నిరూపించింది.

మహానగరంలోని ఇరుకు నివాసాలలోని ఇరుకు జీవితాలకు ఈ కథ అద్దం పట్టింది. విశాల దృక్కోణపు కథాంశం కలిగిన ఈ కథలో శైలి ఒక ప్రత్యేక ఆకర్షణ. రావుగారి పాత్ర స్వరూప స్వభావాలు చిత్రించిన తీరు అందుకొక ఉదాహరణ.

రావుగారు తన సంసార జీవితాన్ని నియంత్రించుకోకపోవడమే పార్థు పతనానికి మూలకారణమని చెప్పక తప్పదు. మనిషి సుఖించటంలో తప్పు లేదు - ఆ సుఖం మరొకరికి కష్టం కానంతవరకు. "అయినా నీకంత 'యావ' పనికిరాదోయ్" అంటుందొక పాత్ర మల్లాది రామకృష్ణశాస్త్రిగారి ఒకానొక కథలో. 'ఆ' యావ అధికం కావటం వలన కలిగిన దుష్ఫలితమే ఇది. రావుగారి ఆవేదనలో అర్థం లేకపోలేదు. కాని ఒక వయసు దాటిన తర్వాత కూడా ఆ యావను పోషించటంతోనే వచ్చింది చిక్కంతా!

భార్యాభర్తల ప్రధాన ధ్యేయం పిల్లల్ని కనటమే కాకపోవచ్చుకాని, తల్లిదండ్రుల ప్రధాన ధ్యేయం పిల్లల పెంపకం, వారి చదువు సంధ్యలు, మంచి చెడ్డలు, భవిష్యత్తు మాత్రమే! తల్లిదండ్రులు అనగానే (కాగానే) కొన్ని త్యాగాలు తప్పనిసరి. సినిమాలు, షికార్ల నుంచి సంసార సుఖం వరకు ఎన్నో కొన్ని భౌతిక, మానసిక, శారీరక సౌఖ్యాలను తల్లిదండ్రులు త్యాగం చెయ్యవలసి ఉంటుంది పిల్లల పెంపకంలో. సరిగ్గా ఇక్కడే రావుగారు పెద్ద

పొరపాటు చేశారు. కొడుకు జీవితం నాశనం కావటానికి కారణభూతుడయ్యాడు. కొడుకు వెళ్ళిపోవటం వలన రావుగారికి కలిగిన ఆవేదన స్వయంకృతాపరాధమే కాని వేరొకటి కాదు.

ఇకపోతే, భారతదేశ దరిద్రానికీ, దాని కామానికీ, దాని జనాభాకీ మధ్యనున్న అవినాభావ సంబంధం స్పష్టాస్పష్టంగా కాదు స్పష్టంగానే కనిపిస్తోంది ఇపుడు.

కథ ప్రారంభ వాక్యాలే ముగింపు వాక్యాలు కావడం ఒక విశేషం. చివరిగా, "నగరం ప్రెషర్ కుక్కర్‌లా వుంది" అన్న పోలిక అత్యద్భుతం! నగర వాసుల మానసిక వత్తిడికి, ఆందోళనకు ఇది గొప్ప ప్రతీక!! అక్షర లక్షలు విలువ చేసే చక్కని పోలికను సృష్టించిన రచయితకు ప్రత్యేక అభినందనలు!!

– శ్రీనివాసరావు టి.వి.

నచ్చని అంశం

## ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

'యయాతి' కథలో రచయిత ఎక్కువ భాగం ఇమాజినేషన్‌కి ప్రాముఖ్యత ఇచ్చారా అనిపించింది. కథ సూటిగా, స్పష్టంగా వుండాలని 'వసుంధర' 'సాహితీ వైద్యం'లో సలహాలనిస్తుంటే ఇక్కడ మాత్రం అందుకు వ్యతిరేకంగా రచయిత నడిచాడు. కథలో మొదటి భాగంలో ప్రాంతాన్ని పరిచయం చెయ్యటం అనేది, ఇరుకు జీవితానికి కథలో వున్న ప్రాముఖ్యత దృష్ట్యా అవసరమే అయినా చాలా ఎక్కువయ్యింది. 'రావుగారు, నారాయణ కుట్టి దారిలో కల్సుకుని ఇసుక దిబ్బ మీద కూర్చున్నారు' అన్నాక మళ్ళీ రావుగార్ని గురించి సుదీర్ఘ వివరణ ఇచ్చి (ఉదాహరణలతో సహా) అప్పుడు మళ్ళీ వాళ్ళిద్దరి సంభాషణ రాయటం వల్ల కథ నడకలో కుంటు ఏర్పడింది. ఇక పార్థు విషయంలో చివరికి రావుగారు అన్న మాటలు – 'ఈ యయాతి దాన్ని దోచుకొని సుఖపడగలిగే శక్తి పోగొట్టుకొన్నాడు!'. ఇవి ఆ పాత్ర స్వభావానికి నప్పేవి కావు. నిజానికి రావుగారు కొడుకు యవ్వనాన్ని దోచుకున్నదేం లేదు. సరైన ఆలోచనా దృక్పథం లోపించిన పార్థు తనంతట తానే తన యవ్వనాన్ని కోల్పోయాడు.

కథని సుదీర్ఘంగా ఐదారు పేజీలకి పెంచే ప్రయత్నం సుమా అనిపించేంతగా వుందీ కథ. స్పష్టత లోపించింది. దానికి కారణం కథ నడకలో సాఫీతనం లేకపోవటం. ఎన్నుకున్న విషయానికే గురి చూసి సంఘటనలని నడిపినా, ఈ లోపం వల్ల కథ చదివిన తర్వాత ఎడిఫనీ కలగదు. యయాతి పోలిక అనవసరమే.

– అనూరాధ. జె